# స్వయంకృతం



వేసవి కాలం ఎండలు మండిపోతున్నాయి.

రాత్రి తొమ్మిది దాటినా కూడా వేడిగాలి వీస్తూనే ఉంటోంది. రాత్రుళ్ళు ఇంట్లో ఈగల మోతైతే లేదు కాని, ఉక్క భరించనట్లుగా ఉంటుంది. ఈ బాధ పడలేక హాయిగా రెండో ఆట సినిమాకు చూసి వద్దామని బయలుదేరాడు రాజు.

సినిమా హాలు దగ్గర్లోనే ఉంది. అందులో నడుస్తోంది పాత సినిమానో, ఏమో... జనం కూడా చాలా పలచగా ఉన్నారు. పైగా– ఆరోజు ఆ సినిమాకి ఆఖరు రోజు. ఇటువంటి సినిమాకి వెళితేనే హాయిగా, విశ్రాంతిగా కూర్చోవచ్చని భావించి టికెట్ కొన్నాడు రాజు.

హాల్లో జనం కలుపు తీసిన మడిలో మొక్కలలాగా అక్కడొకరు, అక్కడొకరు ఉన్నారు. రాజు హాయిగా ముందు సీటు మీద రెండు కాళ్లూ నిగడదన్ని కూర్చున్నాడు. అతను కూర్చున్న వరసలో జనం ఇద్దరు, ముగ్గురు కంటే ఎక్కువ లేరు. అందులోనూ అతని సీటుకి దగ్గర్లో అటూఇటూ అసలే లేరు.

సినిమా చాలా బోరింగ్‌గా ఉంది. దానికితోడు- 'బ్రాండ్ న్యూ ప్రింట్' అని కాగితాల మీద రాసినా... బొమ్మ కనిపించక, మాట వినిపించక నానా అవస్థ పెడుతోంది.

రాజుకి నిద్రైతే రావడం లేదు కానీ- ఆవలింతలు, వాటి వెనకే కన్నీళ్లూ వస్తున్నాయి. ఒళ్ళు మహా బద్ధకంగా ఉంది. పనిలేని మంగలి- పిల్లి తల గొరిగాడో లేదో కాని, విసుగ్గా ఉండే వ్యక్తి చేతులు ఊరికే ఉండవు. రాజు ఎడమ చేయి ఖాళీగా ఉన్న ప్రక్క సీటు మీదికి వెళ్లింది. వెళ్లింది వెళ్లినట్లు ఉండకుండా అటూఇటూ తడమడం మొదలుపెట్టింది.

ఫోం రబ్బరు ఉన్న ఆ సీటుకి అంతకుముందే ఎవరో బుద్ధిమంతుడు చిల్లు వేశాడు. రాజు వేలు ఆ చిల్లులోకి వెళ్లింది. వెళ్లింది ఊరుకోక, కొంచెం రబ్బర్ని బయటికి లాగింది. యథాలాపంగా ప్రారంభమైన ఆ ప్రక్రియ- వేగం పుంజుకుని, ఎక్కువ సమయం కాకుండానే పూర్తి అయింది.

ఫలితంగా- రబ్బరంతా ముక్కలుముక్కలుగా బయటికి వచ్చి కుర్చీల కింద దాక్కుంది. రబ్బరంతా పోయేసరికి సీటు కవరు గాలిపోయిన బుడగలాగా, పంచరు పడ్డ సైకిల్ టైరు లాగా చెక్కకి అంటుకుపోయింది. ఆ విధంగా కాలక్షేపం చేసి, సినిమా మరీ బోరు కొట్టుంటే పూర్తిగా చూడకుండానే ఇంటికి చేరుకున్నాడు రాజు.

మర్నాటి నుంచి ఆ హాల్లో రాజు ఎన్నాళ్లనుంచో చూడాలనుకుంటున్న మరొక సినిమా వచ్చింది. ఆరోజు రాజు ఆ సినిమా చూద్దామని వెళ్లి టికెట్ కొనుక్కున్నాడు. లోపలికి వెళ్లాక ఆ క్లాసంతా చీకటితో నిండి ఉంది.

'ఎక్కడ కూర్చోవాలా...' అని ఆలోచిస్తున్న రాజుకి హాలు మనిషి వచ్చి టార్చితో ఖాళీగా ఉన్న ఒకేఒక సీటు చూపించాడు. సంతోషంగా వెళ్లి దభాలున ఆ సీట్లో కూలబడ్డాడు రాజు. వెంటనే "అబ్బా..!" అని అరుస్తూ లేచి నుంచున్నాడు కుర్చీలోంచి. పొడుచుకున్న మేకొకటి కసుక్కున గుచ్చుకుంది అతనికి.

అప్పుడు జ్ఞాపకానికి వచ్చింది రాజుకి- తాను ఆ సీటుకి క్రితంరోజు 'క్షవరం' చేసిన సంగతి!

- యోజన పక్ష పత్రిక... *16–29 ఫిబ్రవరి '88*